# సరదా కథలు

వాసుదేవరావు ఇప్పుడిప్పుడే పైకి వస్తు(న్నానముకుంటు)న్న రచయిత. రచనలో సరకులేకపోయినా పబ్లిసిటీతో జనాల్ని దిగ్భ్రాంతుల్ని చేయటంలో ఘనాపాటి, అతనికతనే సాటి.

సీరియల్ మొదలవగానే— సినిమావాళ్ళు కథకి హక్కుల్ని కొనుక్కోవటంలో తన ఇంటి ముందు కదలకుండా పడిగాపులు కాస్తున్నారన్న వార్తల్ని సృష్టించడంలోను, పెద్ద పెద్ద సినిమా డైరెక్టర్లు అతనితో పరిచయాన్ని పెంచుకోడానికి ఉవ్విళ్ళూరుతున్నారన్న అపోహని అవతలి వాళ్ళకి కలిగించటంలోను— విపరీతమైన తెలివి తేటలు కలవాడు.

ఎవరైనా సరే— "ఈ మధ్య సినిమాలో డబుల్ మీనింగ్ డైలాగులెక్కువ అయిపోతున్నాయండీ?" అని అంటే

"కరెక్టండీ... ఇదే మాట మొన్న ఎయిర్‌పోర్ట్‌లో దాసరి నారయణరావు గారు, నేను అనుకుని తెగ బాధపడ్డాం" అంటాడు వాసుదేవరావు వీలయినంత వరకు తనకు తెలిసిన ఎక్స్‌ప్రెషన్లు గుప్పించేసి.

ఇతగాడు, దాసరి నారాయణరావు యమా క్లోజ్ అని ఫ్లైట్‌లలో తెగ విహరించేస్తూ ఉంటారన్న నమ్మకాన్ని ఎదుటివాడితో అతి గాఢంగా నాటుకుపోయే లెవెల్లో ఉంటాయి ఆ ఎక్స్‌ప్రెషన్లు.

దాంతో అవతలివాడు ఫట్! మర్నాటి నుంచి సరెండర్! మూడో రోజు నుంచి పబ్లిక్‌లో అతగాడే ఇతగాడికి ప్రచార బాకా! అదీ వాసుదేవరావు టెక్నిక్.

అసలు జరిగింది వేరుగా ఉంటుంది. అదెలా అంటే వాసుదేవరావుకి మార్నింగ్ వాక్ వెళ్ళినట్టుగా ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళే అలవాటు ఉంది. కొంతమంది ఫారినర్స్ దిగగానే డాలర్స్‌ని రూపాయల్లోకి మార్చుకునే సదుపాయంలాగ వాళ్ళ చేతిలో మ్యాగజైన్స్‌ని తీసుకుని రూపాయిలిస్తాడితను. వాళ్ళు అవేం పట్టించుకోరు. ఆనందంగా పుచ్చేసుకుంటారు. ఆ మ్యాగజైన్స్‌లో సరుకుని చిదానందంగా (అనువదించేసుకుని పత్రికలకి ఇతడు ఇచ్చేసుకుంటాడు.

పత్రికలవాళ్ళు వాటిని మహదానందంగా అచ్చేసుకుంటారు. పాఠకులు బ్రహ్మానందంగా మెచ్చేసుకుంటారు. ఇది రొటీన్‌గా జరిగే భాగోతమే! అటువంటి సందర్భంలో ఓ రోజు దాసరి నారాయణరావు గారు కూడా మద్రాసు ఫ్లైట్ కోసం ఎయిర్‌పోర్ట్‌లో వెయిట్ చేస్తూ పక్కనున్న వాళ్ళతో మాట్లాడుతూ— సినిమాల్లో డబుల్ మీనింగ్‌ల విషయం మీద బాధపడి ఉంటారు.

అది విన్న వాసుదేవరావు కామన్ టాపిక్కే కాబట్టి అలాగే స్పందించి ఆయన అనుకున్నట్టే తను అనుకుని ఉంటాడు. (అనుకుని తీర్తాడు లేకపోతే కుదర్దు). అదే మాట బైటికొచ్చాక పబ్లిక్‌తో అంటాడు— "మొన్న ఎయిర్‌పోర్ట్‌లో దాసరి నారాయణరావుగారు, నేను సినిమాల్లో డబుల్ మీనింగ్‌లు ఎక్కువైపోతున్నాయని అనుకుని తెగ బాధపడ్డాం" అని.

ఇందులో ఒక్కముక్క కూడా అబద్ధం లేదు. అసలు టెక్నిక్ అంతా వాసుదేవరావు వ్యవహారాన్ని కలబోసి చెప్పే తీరులో ఉంది. ఆ నిష్పత్తి అవతలివాడి అజ్ఞానాన్ని బట్టి, వాడి బలహీనత బట్టి ఉంటుంది. దటీజ్ వాసుదేవరావు.

ఈ నేపథ్యంలో—

## రింగ్ మాస్టర్ సర్కస్

"ఈ మధ్యనే సూపర్ డైరెక్టర్ మల్లిఖార్జునరావు గారికి సరదాగా ఓరింగ్ ఇచ్చాను" అన్నాడు వాసుదేవరావు.

ఉలిక్కపడ్డాడు విశ్వప్రసాద్— "ఎవరూ? నంబర్‌వన్ సూపర్ డైరక్టర్ మల్లిఖార్జునరావుగారేనా?" అని అడిగాడు నమ్మలేక.

"యస్" అన్నాడు వాసుదేవరావు ముసిముసిగా నవ్వుతూ.

"తీసుకున్నాడా? ఏం అనలేదా??"

"ఏం అంటాడు? చాలా హ్యాపీగా ఫీలయ్యాడు. ఇప్పుడు ఆయన కోసం ఓ కథ తయారు చేస్తున్నాను."

"అది ఏ పత్రికకైనా కమిట్ అయ్యారా?" అడిగాడు విశ్వప్రసాద్ గొంతు తగ్గించి.

అన్నట్టు విశ్వప్రసాద్— 'ఆసోమబుగుశుశ' అనే పత్రిక్కి ఎడిటర్. వారంలో ఏరోజు ఆ పత్రిక విడుదల అవుతుందో తెలియక అన్ని వారాల పేర్లలో మొదటి అక్షరాల్ని కలిపేసి ఆ పత్రిక్కి ఆ పేరు పెట్టుకున్నారు.

"భలేవారే ఎక్కడో కమిట్ అయితే ఆ ప్రస్తావన ఇక్కడెందుకు తెస్తాను?

ఆ సీరియల్ మన పత్రికలో అయితేనే అదిరిపోతుంది" అన్నాడు వాసుదేవరావు.

"అవునండి... అది మనకే కదా" అన్నాడు విశ్వప్రసాద్ ఆశగా ముందుకు వంగి.

"ఖచ్చితంగా... అనౌన్స్‌మెంట్లు అదిరిపోవాలి ... జిగ్గుమనాలి"

"ష్యూర్... ఆ అనౌన్స్‌మెంట్ ఎలా ఇవ్వాలో అది కూడా మీరే రాసి ఇచ్చెయ్యండి. ఉత్తరాల పేజీ మేకప్ అవుతోంది. అందులో తోసేస్తాను" అన్నాడతను కొన్ని కాగితాలు వాసుదేవరావు ముందు పెడుతూ.

ఓ అరగంట తర్వాత...

"కొత్త సీరియల్ రాయడానికి ఒప్పుకున్నాను. ఇదిగో అడ్వాన్సు ఇచ్చాను" అన్నాడు వాసుదేవరావు భార్య చేతిలో డబ్బు పెడుతూ.

"రాయడానికి ఏం ప్లాన్ చేశారు?" అడిగిందామె. తన భర్త సంగతి ఆమెకు బాగా తెలుసు.

"ఇంకా ఏం చెయ్యలా... ఇప్పుడు కూచొని ఆలోచించాలి."

"నేనన్నది అది కాదు... వాళ్ళని ఒప్పించడానికి ఏం ప్లాన్ వేశారూ అని!?"

"హదా... సూపర్ డైరెక్టర్ మల్లిఖార్జునరావుగారికి రింగ్ ఇచ్చానని చెప్పాను."

"ఉంగరమా... అంత డబ్బు మీకెక్కడిది? అసలంత చనువెక్కడుంది మీకు ఆయనతో? అవన్నీ ఆ పత్రికవాళ్ళు నమ్మేశారా?" అందామె భయంగా.

"నమ్మక?" అన్నాడతను గర్వంగా.

"ఇంత నమ్మకద్రోహమా?"

"ఇందులో నమ్మకద్రోహం ఏవుంది? నేను రింగ్ ఇచ్చానని చెప్పాను అందులో అబద్ధం అస్సలు లేదు. మొన్న మల్లిఖార్జునరావుగారికి ఫోన్ చేసి — బాగున్నారా సార్? ఈ ఊరికి ఎప్పుడొస్తారు? అని అడిగాను. నేను చెప్పిందీ అదే— రింగ్ ఇచ్చానని. ఆ పత్రికవాళ్ళు ఉంగరం ఇచ్చానన్న అర్థంతో నమ్మితే ఆ తప్పు నాదెలా అవుతుంది?"

"అయినా అలా తప్పుదారి పట్టించొచ్చా?"

"ఇవన్నీ పబ్లిసిటీ గిమ్మిక్‌లే పిచ్చిదానా" అన్నాడు వాసుదేవరావు వెనక్కి వాలి కళ్ళు మూసుకుంటూ.